ప్రజాశక్తి



నేడు జిల్లా సమగ్రాభివృద్ధిపై సిపిఎం సెమినార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా సమగ్రాభివృద్ధి–ప్రత్యామ్నాయ విధానాలు, అభివృద్ధిలో వెనుకబాటుకు సమగ్ర పరిష్కారాలను చర్చించడానికి తపోవనం సమీపంలోని రేడియంట్ ఫంక్షన్ హాల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం సెమినార్ నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన నిర్వహిస్తున్న సెమినార్‌ను ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రారంభిస్తారని చెప్పారు. ప్రొఫెసర్ బావయ్య, ఎస్ఎం.బాషా, సత్యబోస్, చంద్రశేఖర్, కాస్ట్రో కిరణ్, డాక్టర్ ప్రసూన తదితరులు వివిధ అంశాలపై ప్రసంగిస్తారన్నారు. జిల్లాలో సాగునీటి వనరులు, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు– ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలు, పరిశ్రమలు– ఉపాధి, ఐటి ఇతర రంగాల్లో ఉపాధి అవకాశాలు– ఆటంకాలు, సామాజిక తరగతులు – అభివృద్ధి– ఆటంకాలు, మహిళలు– వ్యవసాయం ప్రభుత్వ ఉద్యోగాలు– పోటీపరీక్షలు– సామాజిక సమస్యలు, విద్యా వైద్యం జిల్లాలో విద్యారంగం పరిస్థితి ప్రభుత్వ విద్య ఆవశ్యకత అంశాలపై సెమినార్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధినికాంక్షిస్తున్న వారందరూ ఈ సెమినార్‌లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైల్వే బ్రిడ్జిల నిర్మాణానికి మోక్షం ఎప్పుడు ..?



రైల్వే గేటు వేయడంతో నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి - రాయదుర్గం

రాయదుర్గం పట్టణ పరిధిలో నాలుగు చోట్ల రైల్వే లైన్ క్రాసింగ్ గేట్లు ఉన్నాయి. అనంతపురం రహదారి, కనేకల్ రోడ్డు, బిటి ప్రాజెక్ట్ రోడ్డు, గొల్లపల్లి రోడ్డు, వద్ద రైల్వే క్రాసింగ్‌లు ఉన్నాయి. ఇందులో వాహనాల రాకపోకలు అధికంగా ఉన్న అనంతపురం రోడ్డు, కనేకల్ రోడ్డు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిలను రైలు మార్గం మీద నిర్మించేందుకు సుమారు 10 ఏళ్ల క్రితం అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఒక్కొక్క బ్రిడ్జి నిర్మాణానికి 10 కోట్ల రూపాయల అంచనా వ్యయం కాగా రైల్వే శాఖ రైలు మార్గాలకు ఇరువైపులా పిల్లర్లను నిర్మించి వాటిపై గరండాలు ఏర్పాటు చేసింది. ఈ పిల్లర్లకు ఇరువైపులా ర్యాంపుతో కూడిన రోడ్డు మార్గాన్ని రోడ్డు భవనాల శాఖ నిర్మించాల్సుంది. అయితే నిధులు విడుదలకాని కారణంగా ఈ నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో నిర్మాణ వ్యయం మూడు నుండి నాలుగు రెట్లు పైగా పెరిగింది. అనంతపురం రహదారి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 41.5 కోట్ల రూపాయలు, కనేకల్ రోడ్డు రైల్వే క్రాసింగ్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 35 కోట్ల రూపాయలు అవసరమని రోడ్లు భవనాల శాఖ అధికారులు అంచనాలు వేశారు. అయితే ఇందుకు అవసరమైన నిధులు విడుదల కాక పనులు చేపట్టలేదు. రాయదుర్గం రైల్వే స్టేషన్ జంక్షన్ నుండి నిత్యం 25 నుండి 30 గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. రైలు ప్రయాణించిన ప్రతిసారి పట్టణ పరిధిలోగల నాలుగు లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రైల్వే గేట్లు మూసివేస్తారు. కనీసం ఐదు నుండి పది నిమిషాల పాటు ఈ మార్గంలో ఉన్న రోడ్డుపై వాహనాల రాకపోకలు ఆగిపోతాయి.

రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం విషయంలో జాప్యానికి రోడ్లు భవనాల శాఖ అధికారులు, నైరుతి రైల్వే అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేస్తూ సాకులు చెబుతున్నారు. రాయదుర్గం– తుంకూరు రైలు మార్గ నిర్మాణంలో భాగంగా రైలు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అయ్యే వ్యయంలో సగం మొత్తాన్ని రైల్వే శాఖ భరించాల్సి ఉండగా ఆ మొత్తం ఆ శాఖ సమకూర్చకపోవడంతో ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదని రోడ్లు భవనాల శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా రైలు మార్గానికి ఇరువైపులా పిల్లర్లు నిర్మించి గరండాలు నిర్మాణం చేపట్టడంతో తమ శాఖ పని పూర్తి అయిందని ఇరువైపులా రోడ్డు ర్యాంపును నిర్మించే బాధ్యత రాష్ట్ర రోడ్లు భవనాల శాఖపై ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు లేఖలు రాసినట్లు రాయదుర్గం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. వాహనాలు ప్రయాణికుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని రైల్వే గేట్ల స్థానంలో అసంపూర్తిగా ఉన్న రైలు ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

మొరాయించిన గూడ్స్ రైలు

వాహనాల రాకపోకలకు అంతరాయం



రైల్వే గేటు వద్ద నిలిచిపోయిన గూడ్స్ ఇంజన్

ప్రజాశక్తి - రాయదుర్గం

రాయదుర్గం స్టేషన్ నుండి చిక్కజాజురువైపు శనివారం వెళుతున్న గూడ్స్ రైలు ఇంజన్ మొరాయించడంతో అనంతపురం రోడ్డు వద్దగల రైలు క్రాసింగ్ 98 వద్ద అరగంటకు పైగా గేట్లు మూసివేశారు. దీంతో గేటుకు ఇరువైపులా రోడ్డుపై వందలాది వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం రైల్వే మెకానిక్‌లు ఇంజన్ మరమ్మతు చేసినప్పటికీ కొద్ది దూరం వెళ్ళాక బీటీపీ రోడ్డు రైలు గేటు సమీపంలో మరోసారి ఆగింది. దీంతో అక్కడ కూడా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో చేసేది ఏమీ లేక ఇంజన్‌ను రాయదుర్గం రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చారు.

మతసామరస్యానికి ప్రతీక జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్

డిఐజి ఆర్ఎన్. అమ్మిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

మతసామరస్యానికి ప్రతీకగా జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ నిలుస్తుందని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్. అమ్మిరెడ్డి అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని మహబూబ్ సుబహానీ దర్గాలో ఘనంగా గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. అనంతపురం రేంజ్ డీఐజీ, జిల్లా ఎస్పీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు సంబంధించిన ప్రార్థనా మందిరాలు ఇక్కడ ఉన్నాయని, ఆయా పర్వదినాలు జిల్లా పోలీసు శాఖ ఘనంగా నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఇది శుభ పరిణామమన్నారు. పోలీసులకు ప్రజలు మరింత సహకారం అందించాలని కోరారు. పర్వదినాలు కొంతమందికే పరిమితం కాకుండా అందరూ సంతోషంతో చేసుకోవాలనే సదుద్దేశ్యంతో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నగర పరిసరాలలో ఉన్న వృద్ధాశ్రమాలు, మహిళలు, అంధుల ఆశ్రమాలకు భోజనాలు పంపారు. పోలీసు కుటుంబాలకు సిద్ధం చేయించిన వంటకాలలో సుమారు 500 మందికి సరిపడా మాంసాహార వంటలు ఆయా ఆశ్రమాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, రామకృష్ణ, హనుమంతు, ఎఆర్ డీఎస్పీ మునిరాజ్, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి, దర్గా కమిటీ సభ్యులు మసూద్ వలి, షెక్షావలి, నాగరాజు, ఖాదర్ వలీ, లింగమయ్య, బాబాఫకృద్దీన్, దౌలా, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న డిఐజి, ఎస్పీ

హెచ్ఎల్‌సి, హంద్రీనీవాకు సాగునీరివ్వాలి

ఎపి రైతు, కౌలు రైతుసంఘం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

హెచ్ఎల్‌సి, జిబిసి, హంద్రీనీవా కాలువల కింద రైతులు సాగు చేసిన పంటలకు చేతికి అందేవరకూ సాగు నీరు అందించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌలుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఉరవకొండ, రాయదుర్గం, గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో, హెచ్ఎల్‌సి ఆయకట్టు కింద 80వేల ఎకరాలకుపైగా, హంద్రీనీవా కాలువ కింద కూడా 20 ఎకరాలకుపైగానే పంటలు సాగు చేశారన్నారు. మిర్చి మొక్కజొన్న, పత్తి, జొన్న, కంది, మొదలైన పంటలను సాగు చేశారని తెలిపారు. మిరపకు ఎకరాకు రూ.30 వేలు రూ.80 వేల వరకూ పంట పెట్టుబడులు పెట్టారన్నారు. వీటికితోడు కౌలు రైతులు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకూ ముందస్తు గుత్త చెల్లించారని తెలిపారు. రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది కానీ హెచ్ఎల్‌సి ఎస్‌సి తుంగభద్ర డ్యామ్‌లో వర్షాభావం చేత అనుకున్నంత నీరు రాలేదన్నారు. అందువల్ల ముందుగా ప్రకటించిన 26 టీఎంసీలకు ప్రస్తుతం 16 టీఎంసీలు మాత్రమే నీరు వస్తుందని, వాటిలో 10 టీఎంసీలు తాగునీటి కోసం 6 టీఎంసీలు కాలువలకు, చెరువులకు నవంబరు 10 వరకూ మాత్రమే వస్తాయని ప్రకటించారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి తీవ్ర భయాందోళనలకు గురవుతున్న రైతాంగాన్ని కౌలు రైతులను ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. లేకపోతే అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవాల్సిందేనన్నారు. కావున ప్రభుత్వం స్పందించి పంటలు చేతికొచ్చేంత వరకు నీరు సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పండ్లతోటల రైతు సంఘం నాయకులు వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు వాల్మీకి మహర్షి

రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి.ఉషాశ్రీచరణ్



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి, తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహనీయుడు వాల్మీకి మహర్షి అనిరాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ.ఉషాశ్రీచరణ్ అన్నారు. జిల్లా వెనుకబడినత తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద నున్న కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాల్మీకి మహర్షి రాష్ట్ర స్థాయి జయంతోత్సవం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కెవి.ఉషాశ్రీచరణ్, జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొగాకు రామచంద్ర, విజయవాడ వాల్మీకి బోయ కార్పొరేషన్ ఎమ్‌డి డి.చంద్రశేఖర్ రాజు, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అంతకు మునుపు నగరంలోని పవర్ ఆఫీస్ నుంచి కళాశాల వరకు పెద్ద ఎత్తున మహిళలు, విద్యార్థులు బోనాలతో ర్యాలీ నిర్వహించి అక్కడ ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకి మహర్షి జయంతోత్సవం చాలా ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఎక్కువగా బీసీలున్న అనంత జిల్లాలో పండగ వాతావరణంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు సోదర భావంతో ఉండాలన్న వాల్మీకి అందించిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ మానవాళికి జీవన ప్రమాణాలు పెంపొందించుకోవడానికి రామాయణం దోహదపడిందన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ఆదర్శనీయుడన్నారు. మూడుసార్లు అనంతలోనే వాల్మీకి జయంతోత్సవాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్రంధి వెంకటేష్, బిసి సంక్షేమ శాఖ డిడి ఖుష్బు కోరారి, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు కాపాడటమే ప్రథమ కర్తవ్యం : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



రక్తదానం చేస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ప్రజలను రక్షించడమే ప్రథమ కర్తవ్యమని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ముందుగా తానే స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తదానం చేయడం అంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మ కల్పించడమేనన్నారు. అనంతరం క్వార్టర్స్‌లోని శ్రీకోదండ రామాలయ కళ్యాణ మండపంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, పోలీసు డాక్టర్ వెంకటేశ్వరప్రసాద్, ఐఎంఏ నగర బ్రాంచి అధ్యక్షులు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ శంకర్ గౌడ్, సీఐ విశ్వనాథచౌదరి, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి గాండ్ల హరినాథ్, శివ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

లేకుంటే సమ్మెకు సిద్ధం - కార్యాలయాల కార్మికుల ఎదుట ధర్నా



అనంతపురంలో అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయకపోతే రాష్ట్రవ్యాప్త సమ్మెకు సిద్ధమని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బండారి ఎర్రిస్వామి అధ్యక్షతన శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రతిపక్షంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలనని, రెగ్యులర్ కార్మికులకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని, పాత పద్ధతి ఓపిఎస్ అమలు చేయాలన్నారు. సిఎం జగన్ మాట తప్పను.. మడమ తిప్పను అని చెప్పి ఏ ఒక్కటీ అమలు చేసిన పాపానపోలేదన్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండటంతో మున్సిపల్ కార్మికుల దగ్గరికి ఏమొహం పెట్టుకుని ఓటు అడుగుతున్నారని నిలదీశారు. మున్సిపల్ కార్మికులందరూ జగన్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్ సెమి స్కిల్డ్ అమలు చేసి రిస్క్ అలివెన్స్ ఇవ్వాలని మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఆప్కాస్ ద్వారా కాకుండా, జీవో 010 ట్రెజరీ ద్వారా జీతాలు ఇవ్వాలని, రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న డిఏలు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, పట్టణాలకు అనుకూలంగా కార్మికుల సంఖ్య పెంచాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని, కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను యథావిధిగా అన్ని మున్సిపాలిటీల్లో కొనసాగించాలని, రాష్ట్ర ప్రభుత్వం జగనన్న బస్సుయాత్ర పైన పెట్టిన దృష్టి, మున్సిపల్ కార్మికులపై ఎందుకు పెట్టడం లేదని నిలదీశారు. కార్మికుల అంటే ఇంత చిన్నచూపా.. అన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇస్తానన్న హామీలు అమలు చేయకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికులందరూ సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అనంతరం సూపరింటెండెంట్ ఇంజనీర్ నాగమోహన్, కార్పొరేషన్ కార్యదర్శి సంఘం శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, నగర కార్యదర్శి తిరుమలేష్, ఆది, శ్రీనివాస్‌మూర్తి, ఇంజనీరింగ్ సెక్షన్ రాయుడు, మురళి, ఓబుళపతి, మల్లి, పోతలయ్య, మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి, కాంతమ్మ, మరియమ్మ, లక్ష్మీనరసమ్మ, ఇమాంబి, రాజు, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

తాడిపత్రి : మున్సిపాలిటీ పరిధిలోని కార్మికులకు పనిభారం తగ్గించాలని మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య, ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు రామాంజనేయులు, సెక్రటరీ జగన్మోహన్, మున్సిపల్ ఇంజనీర్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు ఉపాధ్యక్షులు ఓబయ్య, జిపి ప్రసాద్, మహబూబ్‌బాషా, కమిటీ మెంబర్లు ధనలక్ష్మి, నాగలక్ష్మి, సద్దాం, రాము, రమేషు, డ్రైవర్లు నాగేంద్ర, బాల, నారాయణ, కంప్యూటర్ ఆపరేటర్లు జిలాన్, చంద్రమౌళి, సతీష్, వెంకటరమణ, వసంత, అపర్ణ, స్వీపర్లు శాంతి, దేవి, మధు, భారతి, పారిశుధ్య విభాగం అధ్యక్షులు వన్నూరప్ప, కమిటీ మెంబర్లు రాముడు, శంకర్, నారాయణ మహిళలు పుల్లమ్మ, లక్ష్మీదేవి, ఆదిలక్ష్మి, ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గుంతకల్లు : ఎన్నికలకు ముందు సిఎం జగన్ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు కె.నరసయ్య డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జగదీష్, దాసు, చిన్నా, సిఐటియు నాయకులు కసాపురం రమేష్, జగ్గలి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం కమిషనర్ జి.శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి బాల రంగన్న, హరి, పుల్లన్న, శివశంకర్, ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు మురళి, రవి, రాజా, ముత్యాలు, స్టాలిన్, మహేష్, ఆది, శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ ఇవ్వాలి

పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులకు అంతరాయం లేని నాణ్యమైన తొమ్మిది గంటల విద్యుత్‌ను సరఫరా చేయాలని ఎమ్మెల్యే, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్ కోరారు. శనివారం విడపనకల్ మండల పరిధిలోని మాలాపురం గ్రామంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ శాఖ సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రూ.లక్షలు వెచ్చించి పంటలు సాగు చేశారన్నారు. ఈనేపథ్యంలో జిబిసి కెనాల్‌లో సాగునీరు ఉన్నంత వరకైనా రైతులకు అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు. తొమ్మిది గంటల పాటు ఇవ్వాల్సిన విద్యుత్ కనీసం నాలుగు గంటలు కూడా ఇవ్వకుండా రైతుల జీవితాలతో చెలగాటమాడటం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పడానికే సరిపోయిందికానీ వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు పంటపొలాలలోనే రాత్రి పగలు గడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా పగటిపూటి 9 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బీడీ చిన్నమారయ్య, అనంతపురం జిల్లా పార్లమెంటు ప్రధాన కార్యదర్శి బోయ హనుమంతు, సర్పంచులు చంద్రశేఖర్, నాయకులు బాబు రాజేంద్రప్రసాద్, సినిమా రామాంజనేయులు, ఉప్పర నాగరాజు, మాజీ ఎంపీటీసీ జోగి ఎర్రిస్వామి, నాగరాజు, మాజీ కో అప్షన్ సభ్యుడు అలీబాషా, తదితరులు పాల్గొన్నారు.

రొయ్యలు, చేపల ఫుడ్ ఫెస్టివల్‌ను ఉపయోగించుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, అధికారులు

రొయ్యలు, చేపల ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి కోరారు. శనివారం అనంతపురం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రొయ్యలు, చేపల ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 3, 4, 5వ తేదీల్లో కర్నూలు నగరంలోని రావూరి గార్డెన్స్‌లో రొయ్యలు, చేపల ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఫిషరీస్ శాఖ ఇన్‌ఛార్జి డిడి చంద్రశేఖర్‌రెడ్డి, డిఆర్‌డిఎ హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకుంటేనే వ్యవసాయంలో లాభాలు : జెసి కేతన్‌గార్గ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



నూతన బూమ్ స్ప్రేయర్లను పరిశీలిస్తున్న జెసి కేతన్‌గార్గ్

టెక్నాలజీ అందిపుచ్చుకుంటే వ్యవసాయ రంగంలో ఊహించని విధంగా లాభాలు పొందవచ్చని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. శనివారం నగరంలోని జిఎం ఆగ్రో ఇండస్ట్రీస్ అధినేత జిలాన్‌బాషా ఏర్పాటు చేసిన నూతన బూమ్ స్ప్రేయర్ల షోరూంను జెసి ప్రారంభించారు. అనంతరం రైతులకు అవసరమైన వివిధ రకాలైన యంత్రాలు పని ముట్లను జెసి పరిశీలించారు. అనంతరం జెసి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పండ్ల తోటల సాగుతో పాటు పాడి పరిశ్రమ, ఇతర వ్యవసాయ పంటలు విస్తారంగా సాగు అవుతున్నాయని తెలిపారు. వ్యవసాయ కూలీలు ఇతరత్రా సమస్యల నుంచి బయటపడేందుకు యంత్రాలను విరివిగా ఉపయోగిస్తే రైతుకు ఖర్చు తగ్గడమే కాకుండా మంచి పంటలు దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఐపిపిడి ఫిరోజ్‌ఖాన్, హార్టికల్చర్ డిడి రాఘనాథరెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రమణ్యం, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి

వాల్మీకి జయంతిలో విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

బీసీల జాబితాలో ఉన్న వాల్మీకులను షెడ్యూల్ తెగల జాబితాలో చేర్చేందుకు సమిష్టిగా కృషి చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని వినాయక కూడలిలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం పట్టణ పొలిమేరలోని పైతోట వద్ద ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి చెందిన మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు గతంలో కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పటికీ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఏమాత్రం కృషి చేయలేదన్నారు. సిఎం జగన్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందని గుర్తు చేశారు. నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మహర్షి వాల్మీకి రామాయణం రూపంలో గొప్ప వెలుగునిచ్చే కావ్యాన్ని మానవాళికి అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాళు శిల్ప, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఛైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, వార్డు సభ్యులు సంజీవప్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజునాయక్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు శివప్ప, వన్నూరు స్వామి, మంజునాథ, మున్సిపల్ వార్డు సభ్యులు, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని టిడిపి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు వెంకటేశులు, మహబూబ్‌బాషా, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, బిసి సెల్ అధ్యక్షుడు తిప్పయ్య, ఇనాయత్‌బాషా, వేంకటేశులు, తిప్పేస్వామి, నాగరాజు, రామంజి, సిద్దన్న, అంజి, పరమేస్త్రి, రవి, సీనా, వేణు, శ్రీరాములు, ఎస్సీ సెల్ మల్లి, సత్తి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేస్తున్న ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్

రాయదుర్గం రూరల్ : డిసెంబర్‌లో వాల్మీకి జయంతి ఉత్సవాలను పార్టీలకతీతంగా జరుపుకునేలా రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి నిర్ణయించినట్లు అధ్యక్షులు బండి కిష్టప్ప తెలిపారు. శనివారం పట్టణంలోని వాల్మీకి కళ్యాణ మండపంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని పాత టవర్‌క్లాక్ ఆవరణలో వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అయితే వాల్మీకి కళ్యాణమంటపాన్ని ఆధునీకరణ పనులు పూర్తయ్యాక డిసెంబర్‌లో పార్టీలకతీతంగా వాల్మీకులు ఐక్యంగా జయంతిని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంజీవ, సేవా సమితి కార్యదర్శి ఎన్.టి.సిద్దప్ప, ఉపాధ్యక్షులు మలకన్న, కోశాధికారి బండి చంద్రశేఖర్, రఘు, ప్రకాష్, తిప్పేస్వామి, సిద్ధలింగప్ప, సిద్ధప్ప, ముత్తప్ప, రఘు, రాము, చంద్ర, హనుమంతు, తిప్పేస్వామి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం : రామాయణం స్ఫూర్తితో ప్రతిఒక్కరూ మానవతా విలువలు పెంపొందించుకోవాలని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధురకావ్యం రామాయణం అన్నారు. అలాంటి గొప్ప కావ్యాన్ని రచించి యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా వాల్మీకి మహర్షి సమాజానికి అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఎం.హనుమంతు (ఏఆర్), ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, డీపీఓ ఏఓ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : వాల్మీకి జయంతిని పురస్కరించుకుని శనివారం నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్ సూచన మేరకు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు భవాని రవికుమార్, పొదిలి బాబురావు, జయరామ్‌రెడ్డి, అంకే ఈశ్వరయ్య, పత్తి చంద్రశేఖర్, రాపా ధనుంజయ్, జయమ్మ, అవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, సదానందం, జక్కిరెడ్డి ఆదినారాయణ, మేదర వెంకటేష్, రొళ్ల భాస్కర్, చక్రపాణి, వెంకటనారాయణ, హుస్సేన్, కుమ్మర మురళి, సంపత్, అంజి, వెంకటరమణ, ఆకుల అశోక్, ఆకుల ప్రసాద్, వీరమహిళలు అనసూయ, దాసరి సరిత, కమిటీ సభ్యులు సంతోష్ కుమార్, మధు, తాతయ్య, చిరు, నజీమ్, సల్మాన్, పెండ్లిమర్రి శీనా, విజయ్ దేవరయల్, చంద్ర, నవీన్, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

బొమ్మనహాల్ : మండలవ్యాప్తంగా శనివారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అలాగే మండలంలోని గోవిందవాడ, సింగేపల్లి, దర్గాహొన్నూరు, బుల్లనగుడ్డం, కళ్లుహోళ, కురవల్లి, చంద్రగిరి, అరేసముద్రం, దేవగిరి, ఉద్దేహాళ్, కొళగానహళ్లి, శ్రీధర్‌గట్ట, గోనేహాళ్, నేమకల్లు, ఉప్పరాల, లింగదహాల్ గ్రామాల్లో వాల్మీకి చిత్రపటాలను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో విఆర్‌ఒలు నరసింహమూర్తి, యుగంధర, వాల్మీకి సంఘం మండల నాయకులు వన్నప్ప, మాజీ సర్పంచి దేవన్న, అరేసముద్రం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : రామాయణం సృష్టికర్త వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు తరిమెల సూర్యనారాయణ మాట్లాడుతూ రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్క వాల్మీకీ మానవతా విలువలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. వాల్మీకి రామాయణం ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం అన్నారు. అలాంటి గొప్ప కావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి సమాజానికి గొప్ప మేలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు నల్లప్ప, బోయ రవి, ఇల్లూరు రామాంజనేయులు, ఆదినారాయణ, రఘు, రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : వాల్మీకి మహర్షి జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని శనివారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్యకేసు ఛేదింపు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

నార్పల : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న మామిడి తోటలో జరిగిన సిద్ధవటం నారాయణస్వామి హత్య కేసును ఎట్టకేలకూ పోలీసులు ఛేదించారు. ఈమేరకు శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అనంతపురం రురల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో తనతోపాటు నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడి కలిసి హత్యకేసును ఛేదించినట్లు తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకు నార్పల శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. పెరవలి కుళ్లాయప్ప ఐచర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు తన స్నేహితుడైన సిద్ధవటం నారాయణస్వామితో కలిసి మద్యం పార్టీలకు వెళ్లేవారు. ఈనేపథ్యంలో కుళ్లాయప్పకు నార్పలకు చెందిన ఓ వివాహితతో సాన్నిహిత్యం ఉంది. ఈ మహిళతో నారాయణస్వామి అసభ్యంగా ప్రవర్తించాడని ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పటి నుంచి నారాయణస్వామిని ఎలాగైన చంపాలని నిర్ణయించుకున్న కుళ్లాయప్ప ఈనెల 24న ముందుగా రూపొందించుకున్న పతకం ప్రకారం మణికంఠ, జయరాం, నాగన్న, శివ, కుళ్లాయిస్వామితో కలిసి మద్యం తాగడానికి కేశవరెడ్డి తోటకు వెళ్లారు. మద్యం తాగిన తర్వాత నారాయణస్వామికి మత్తు ఎక్కువై అక్కడే పడిపోయాడు. ఇదే అదునుగా భావించిన కుళ్లాయప్ప రాయితో నారాయణస్వామిపై దాడి చేసి చంపినట్లు విచారణలో తేలిందన్నారు.

గుండెపోటుతో పంప్‌హౌస్ ఆపరేటర్ మృతి



మృతిచెందిన లోకనాథ్‌రెడ్డి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని టీ.వీరాపురం పంప్‌హౌస్‌లో ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న లోక్‌నాథ్‌రెడ్డి (43) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల మేరకు... విధి నిర్వహణలో ఉన్న లోకనాథ్ రెడ్డి గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో హుటాహుటిన తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య లావణ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి : ఎమ్మెల్యే తోపుదుర్తి

ప్రజాశక్తి-ఆత్మకూరు

అనంతపురం రూరల్ మండలంలో అర్హులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 90 రోజుల కార్యక్రమం కింద వచ్చిన ఇంటి పట్టా దరఖాస్తులను రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో దెబ్బతిన్న కరెంటు స్తంభాలను మార్పు చేసిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌తో కలిసి ప్రారంభించారు.

ఎస్సీ కాలనీకు మంచినీటి సమస్యపై సిపిఎం వినతి



ఎమ్మెల్యే తోపుదుర్తికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

కాగా ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎం.రామయ్య, పెద్దన్న, గురుస్వామి, రాజా, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి చెరువుకు నీరు తరలించేందుకు చర్యలు

ప్రజాశక్తి-గుత్తి

చెరువుకు నీరు తరలించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రీకారం చుట్టారు. గుత్తి చెరువును కృష్ణాజలాలతో నింపాలని ఇటీవల జెవివి రాష్ట్ర నాయకులు, విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ ఎం.రంగన్న, ప్రజా వైద్యశాల పిఆర్‌ఓ ఇస్మాయిల్, న్యాయవాదులు కె.మనోహర్ బాబు, వైఏ కబీర్, నూర్ మహమ్మద్, సోమశేఖర్ తో పాటు పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో న్యాయమూర్తి ఆదేశాల మేరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు పలు ప్రాంతాలను పరిశీలించారు. గుంతకల్లు మండలంలోని వైటి చెరువు నుంచి గుత్తి చెరువు వరకు ఉన్న పిల్ల కాలువలు, వంతెనల మధ్యలో ఉన్న పూడికతీతలను జెసిబి ద్వారా తొలగిస్తున్నారు. గుత్తి చెరువు నిండితే భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య కొంతమేర పరిష్కారం కానుందని అధికారులు అన్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, డిఇఇ రఘు, ఎఇ సాయినాథ్ బాబు, వైసిపి మండల ఇన్‌ఛార్జి బి.శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, నాయకులు బేడల వెంకటరాముడు, సచివాలయాల కన్వీనర్లు ఎం.రంగస్వామి, వై.సుభాష్‌రెడ్డి, డిష్ అన్వర్, పి.సునీల్ కుమార్, మైనర్ ఇరిగేషన్, హెచ్.ఎల్.సి ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

పక్షవాతాన్ని సమిష్టిగా ఎదుర్కొందాం

సీనియర్ కన్సల్టెంట్, న్యూరాలజిస్ట్ కె.జాషువా కాలేబ్

ప్రజాశక్తి-అనంతపురం



అందరం కలిసి పోరాడితే పక్షవాతాన్ని పూర్తిగా నివారించవచ్చని సీనియర్ కన్సల్టెంట్, న్యూరాలజిస్టు కె.జాషువా కాలేబ్ పిలుపునిచ్చారు. అక్టోబర్ 29న ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది సగటున 1,85,000 మంది పక్షవాతం (బ్రెయిన్ స్ట్రోక్)కు గురువుతున్నారు. అభివద్ధి చెందుతున్న దేశాల్లో బ్రెయిన్ స్ట్రోక్ ఎక్కువగా వస్తోందన్నారు. వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం, ప్రారంభంలోనే వ్యాధిని అరికట్టడానికి సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే అధికంగా పక్షవాతం వస్తోందన్నారు. అతి త్వరగా వ్యాధి సంకేతాలను గుర్తించడం, తగిన సమయంలో సరియైన వైద్యం అందించడం ద్వారా వైకల్యాన్ని అరికట్టవచ్చన్నారు. స్ట్రోక్ నుంచి బయట పడటానికి సమయం అతి ముఖ్యమైన అంశం అన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ అంటే మెదడులోని ఒక భాగానికి రక్తప్రసరణ ఆగిపోవడం అన్నారు. ఇలా రక్తప్రసరణ ఆగిన ప్రతి నిమిషానికి 20 లక్షల న్యూరాన్లు (కణాలు) చనిపోతాయన్నారు. కావున రోగికి మొదట సంకేతం ప్రారంభమైన 4.30 గంటల్లోనే చికిత్స అందజేయాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తేనే న్యూరాలజి విభాగం, అన్ని సదుపాయాలు, ఐసియు ఉన్న ఆసుపత్రులకు తరలించాలన్నారు. కావున మనం కలిసి పోరాడితే పక్షవాతాన్ని పూర్తిగా అధిగమించవచ్చని పిలుపునిచ్చారు.


తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

అనంతపురం : దుకాణదారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కర్నూలు జోన్ లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ చల్లా దయాకర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం నగరంలోని పాతూరు కూరగాయలు, పూలు, పండ్ల మార్కెట్‌లో లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యాపారులు వాడుతున్న తూనికలు, రాళ్లను పరీక్షించారు. ఈ సందర్భంగా ముద్ర లేని కాటాలు, లోపాలు ఉన్న తూనిక రాళ్లను గుర్తించి ఐదు కేసులను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ పి.సుధాకర్, ఇన్స్‌పెక్టర్ ఎం.మహమ్మద్‌గౌస్, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పి.శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్ పి.అక్రమ్, ఆఫీస్ సబార్డినేట్ కె.మహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాఘడ్‌ను దర్శించుకున్న కేంద్రమంత్రి



సేవాఘడ్‌లో పూజలు చేస్తున్న కేంద్రమంత్రి శ్రీపాదనాయక్

గుత్తి : మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న సేవాఘడ్‌ను కేంద్రమంత్రి శ్రీపాదనాయక్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం సంత్ సేవాలాల్ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత సేవాలాల్ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు కేంద్రమంత్రి శాలువా, పూలమాలతో సత్కరించారు.

జగనన్నకు అండగా నిలుద్దాం

బుక్కరాయసముద్రం : కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సిఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని రేకులకుంట, అమ్మవారిపేట గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపిపి దాసరి సునీత, జడ్పిటిసి భాస్కర్, బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి, నాయకులు ఆలూరు రమణారెడ్డి, సాకే రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ముత్యాల రంగనాథ్, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

'జగన్‌కు ఓటమి భయం'

కళ్యాణదుర్గం : సిఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ కంబదూరు మండలం మర్రిమాకులపల్లి గ్రామం నుంచి దాదాపు 10 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ టిడిపికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక అధినేత చంద్రబాబును అక్రమంగా జైలుకు పంపారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా చంద్రబాబుకు విజయం దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు చౌళం మల్లికార్జున, రామ్మోహనచౌదరి, మారుతీచౌదరి, ఆర్జీ శివశంకర్, శివన్న, వైపీరమేష్, లక్ష్మీనారాయణ, సర్మాస్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రిన్సిపల్‌ను నియమించాలి

గుత్తి : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మహిళా ప్రిన్సిపల్‌ను నియమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ బృందం కళాశాలలను పరిశీలించింది. కళాశాల ప్రిన్సిపాల్ సంగీత్ నాయక్ వేధింపులు గురించి అధ్యాపకులు, విద్యార్థినులు ఎస్ఎఫ్ఐ నాయకుల ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు 15 రోజుల క్రితం నియమింపబడ్డ ప్రిన్సిపాల్ సంగీతనాయక్ అధ్యాపకులు, విద్యార్థినులను మానసికంగా వేధిస్తున్నాడని ఆరోపించారు. వెంటనే ప్రిన్సిపల్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కృష్ణ, నాయకులు పెదబాబు, పవన్ గౌడ్, దర్శన్, రంగా, సాయి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

ఉరవకొండ : నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి రూ.87.50 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరవకొండ మండలం చిన్నముష్టూరులోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.27.5 లక్షలు, వజ్రకరూరు మండలం వి.పి.పి.తండా భద్రంపల్లి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.60 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ రెండు ఆలయాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని దేవాదాయ శాఖకు పంపగా స్పందించి ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ఆలయా అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు, చిన్న ముష్టూరు, వజ్రకరూరు మండల విపిపి తండా గ్రామస్తులు వై.శివరామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

చంద్రబాబుపై ఎంపీ వ్యాఖ్యలు తగదు

శింగనమల : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటని టిడిపి జిల్లా నాయకులు మాసూల చంద్రమోహన్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. పబ్లిక్ మీటింగ్‌లో 2024లో జగన్ మళ్లీ సిఎం అవుతారని, చంద్రబాబు చనిపోతాడని ఓ వీధి రౌడీలా మాట్లాడటం బాధాకరమన్నారు. చంద్రబాబును విమర్శించే అర్హత ఎంపీకి లేదన్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు



వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

పట్టణంలోని దోమలను నివారించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలోని కార్యాలయంలో కమిషనర్ మల్లికార్జునను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఆయన మాట్లాడుతూ వారంరోజుల నుంచి తెల్లదోమ పట్టణంలో పూర్తిగా విస్తరించిందన్నారు. తద్వారా ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. కావున తెల్ల దోమ నివారణ కోసం ఫాగింగ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, జగ్గలి రమేష్, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, ప్రతాప్, వెంకి, ఆటో మల్లి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను త్వరగా నింపాలి

పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను వేగవంతంగా నింపి తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్ సూచించారు. శనివారం ఉరవకొండ మండల పరిధిలోని నింబగల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను స్థానిక పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ట్రాక్టర్లతో పంపింగ్ చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో చాలా తక్కువ మోతాదులో నీటిని నిల్వ చేశారన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్లు మండలాల టిడిపి అధ్యక్షులు విజయభాస్కర్, బీడీ చిన్నమారయ్య,మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పురుషోత్తం, మాజీ సర్పంచి ఇంద్రావతి వెంకటేశులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు మిక్సీలు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం



కార్మికులకు మిక్సీలు అందజేస్తున్న దృశ్యం

స్థానిక టీటీడీ సమీపంలోని ఏజీఎస్.రెడ్డి నగర్‌లో ఉన్న ఏజీ శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఎజిఎస్.రెడ్డి ఆర్గనైజేషన్ డిస్కవర్ ఆధ్వర్యంలో 40 మంది మున్సిపల్ కార్మికులకు శనివారం మిక్సీలు, స్టౌలు పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆర్‌డి మూర్తి మాట్లాడుతూ ప్రజలకు ఏజీఎస్ ట్రస్టు ద్వారా చేస్తున్న ఆయన సతీమణి ఏజీ ప్రమీలమ్మ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఎజిఎస్.రెడ్డి వారసుడిగా ఏజీ అనిల్ డిస్కవర్ అనంతపురం పేరుతో స్వచ్ఛ అనంత కోసం చేస్తున్న కృషి ఎవరూ మరువలేనిదన్నారు. డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అనిల్ ఒక పౌరుడిగా అందమైన అనంత కోసం పాటుపడడం అభినందనీయమన్నారు. ఆయనకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఏజి అనిల్ మాట్లాడుతూ తమ తండ్రి చేసిన సేవలను కొనసాగిస్తూ ఆయన బాటలో నడవడం సంతోషకరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రమణారెడ్డి, మెడికల్ హెల్త్ఫీసర్ గంగాధర్‌రెడ్డి, కార్పొరేటర్లు అబూసలహ్, దాదు, జనబలం బాబా, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'ఆరోగ్య సురక్ష' వరం : ఎంపీపీ

బెలుగుప్ప : ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఒక వరం అని ఎంపీటీసీల జిల్లా సంఘం అధ్యక్షులు, ఎంపిపి పెద్దన్న తెలిపారు. శనివారం మండల పరిధిలోని నరసాపురంలో సర్పంచి నాగవేణి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సురేష్, తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపిడిఒ రామచంద్ర, వైద్యసిబ్బంది డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి, ప్రియాంక, సూపర్‌వైజర్ వెంకటరమణ, వైసీపీ నాయకులు త్రిలోకనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ మచ్చన్న, వ్యవసాయ అగ్రి బోర్డు ఛైర్మన్ పి.శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షులు బి.శివలింగప్ప, జి.శ్రీనివాసులు, నరసాపురం సర్పంచి రమేష్, మారుతీరెడ్డి, వెంకట్‌రెడ్డి, పురుషోత్తం, బాబునాయక్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా..

బుక్కరాయసముద్రం : పేదలందరికీ అందుబాటులో ఉంటానని మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి అన్నారు. కొద్దిరోజుల కింద దురదృష్టవశాత్తు మండలంలోని వడియంపేట గ్రామంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త లక్ష్మీనారాయణ కుటుంబానికి పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే తన సొంత నిధులతో గతంలో పార్టీ సభ్యత్వాలు చేసినట్లు తెలిపారు. దీంతో ప్రస్తుతం మృతిచెందిన కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం మంజూరైనట్లు వివరించారు.

సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన

గార్లదిన్నె : సచివాలయాల ఏర్పాటుతో మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం, ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కమలాపురం గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయం, వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెంకటనారాయణ, మండల కన్వీనర్ నరేందర్‌రెడ్డి, తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ విజయభాస్కర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం అడ్డగింత

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలో శనివారం సెల్ టవర్ నిర్మాణాన్ని ప్రజలు అడ్డుకున్నారు. రైల్వే షెడ్డుకు వెళ్లే రహదారిలో నివాసాల మధ్య ఓ ప్రయివేట్ నెట్‌వర్క్‌కు చెందిన మొబైల్ టవర్‌ను కంపెనీ ప్రతినిధులు నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రజల అడ్డుకుని నిర్మాణాన్ని ఆపేశారు. అనంతరం సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టరాదని కోరుతూ మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు కు వినతి పత్రాన్ని అందజేశారు.

జెఎన్‌టియు ఎంటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన ఎంటెక్ 4వ సెమిస్టర్ (ఆర్.21) రెగ్యులర్, ఫార్మా.డి 3వ సంవత్సరం (2020 అడ్మిటెడ్ బ్యాచ్) రెగ్యులర్, బీ.ఫార్మసీ 2వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్.19) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీ.ఫార్మసీ 2వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్.15) సప్లిమెంటరీ, బీ.ఫార్మసీ 2వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.19), (ఆర్.15) సప్లిమెంటరీ, బీ.ఫార్మసీ 1వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.19) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నార్పల ఎంపిడిఒ కార్యాలయంలో ఆడిటింగ్

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 ఆర్థిక సంవత్సరం వరకూ వివిధ ఖర్చులపై రాష్ట్ర ఆడిటింగ్ సభ్యులు శనివారం ఆడిటింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా సీనియర్ ఆడిటర్ చంద్రశేఖర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమాదేవి ఆధ్వర్యంలో కార్యాలయంలోని వివిధ రిజిస్టర్లు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా స్థానిక సిబ్బందితో సందేహాలను నివృత్తి చేసుకుంటూ ఆడిటింగ్ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నూర్ మొహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ నరేంద్ర, టైపిస్ట్ ఆనంద్ పాల్గొన్నారు.

వైసిపి ఎస్టీ సెల్ ఉరవకొండ మండల అధ్యక్షులుగా శేఖర్



ఉరవకొండ : ఉరవకొండ మండల వైసిపి ఎస్టీ సెల్ అధ్యక్షులుగా కొలగుండ్ల శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ మండలంలో వైసిపిని బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో పదవి కేటాయించిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, యువజన విభాగం జోనల్ అధ్యక్షులు ప్రణయ్‌రెడ్డి, సహకరించిన మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉరవకొండ తహశీల్దార్‌గా శ్రీధర్‌మూర్తి



ఉరవకొండ : ఉరవకొండ తహశీల్దార్‌గా శ్రీధర్‌మూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అనంతపురం నుంచి బదిలీపై ఉరవకొండకు వచ్చినట్లు తెలిపారు. మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానన్నారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్, ఎలక్షన్ డిటి మునీంద్ర, ఆర్ఐ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, డిజిహెచ్ఎస్ అధ్యక్షులు గోపాల్, నాయకులు చంద్రశేఖర్, ఓబయ్య, కోనాపురం ఎర్రిస్వామి, రమేష్‌బాబు,పెద్దన్న, తదితరులు ఉన్నారు.

పంటకోత ప్రయోగాలు

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఎన్ఎస్ఎస్ఓ (నేషనల్ స్టాటిస్టికల్ సర్వే) ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం పంటకోత ప్రయోగాలు చేశారు. రైతు బెస్త భీమలింగప్పకు చెందిన వేరుశెనగ పొలంలో పంటకోత నిర్వహించగా 0.350, 0.380 కిలోల తూకం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ సిబ్బంది హేమావతి, పెన్నఅహోబిలం ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, రైతులు శ్రీనివాసులునాయక్, బోయ శ్రీనివాసులు, రారాజు, దయ్యాల నాగరాజు, హనుమంతు, లింగప్ప, ప్రసాద్‌బాబు, రాజకుమార్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడి అమానుషం

అనంతపురం క్రైం : నెల్లూరు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లపై విచక్షణా రహితంగా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగానికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగులు, అధికారులపై రాజకీయ ఒత్తిడి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన శిక్షలు అమలయ్యేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు.ooo